వేధిస్తున్న సర్వేయర్ల కొరత

- పరిష్కారం కాని భూ సమస్యలు
- నెలల తరబడి నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు
- ఒక్కో సర్వేయర్‌కు రెండు, మూడు మండలాల కేటాయింపు
- ముందుకు సాగని భూసర్వేలు


రాజంపేట మండల పరిధిలో సర్వే చేపడుతున్న అధికారులు(ఫైల్)

రాజంపేట: భూ వివాదాలు తలెత్తిన సమయంలో సరిహద్దులు నిర్ణయించేందుకు రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు మీ–సేవ ద్వారా సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకుంటారు. దీంతో సంబంధిత అధికారులు వచ్చి సర్వే నిర్వహించి ఇరువురి సరిహద్దులు చూపి సమస్యకు పరిష్కారం చూపుతారు. కానీ ఇదంతా జిల్లా వ్యాప్తంగా సజావుగా సాగడం లేదు. ఇందుకు కారణం జిల్లాలో సర్వేయర్ల కొరతే. ఉన్న అధికారులకు రెండు నుంచి మూడు మండలాలు కేటాయించడంతో సకాలంలో సేవలు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు.

ఇన్‌చార్జి సర్వేయర్లే దిక్కు..

రాజంపేట మండలానికి సర్వేయర్ అధికారి లేక సుమారు మూడు సంవత్సరాలు కావస్తుంది. భిక్కనూర్‌లో ఉన్న సర్వేయర్ రాజంపేట మండలానికి ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. రెండు మండలాలకు ఒకే సర్వేయర్ ఉండటంలో భూ సమస్యలు త్వరగా సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో కాలయాపనతో పాటు భూ సమస్యల వల్ల వివాదాలకు దారితీస్తున్నాయి. రాజంపేటలో ప్రస్తుతం 8 మంది రైతులు సరిహద్దుల నిర్ధారణ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారలు తెలిపారు.

రెవెన్యూ, అబాది(గ్రామకంఠం) సమస్య...

2019లో అప్పటి ప్రభుత్వం రైతులకు నూతనంగా పట్టా పాస్ బుక్కులను మంజూరు చూసింది. మంజూరు సమయంలో కొంత మంది రైతుల భూమి పట్టాలో చూపకుండా మిగులు భూమి కింద చూపారు. కొంత మంది రైతులు భూమి గ్రామ పరిధికి ఆనుకొని ఉన్న భూములను అబాది(గ్రామ కంఠం)లో కింద చూపారు. వీరు తమ భూమిని క్రయ విక్రయాలు చేయాలంటే యాజమాన్య హక్కు కోసం ఇటు గ్రామ పంచాయతీ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఇప్పటికీ తిరుగుతున్నారు.

వివాదాలు తలెత్తే అవకాశం..

కొంత మంది ప్రైవేటు వ్యక్తుల సహాయంతో సర్వే చేయించుకుంటారు. అయితే ప్రభుత్వ సర్వేకు, ప్రైవేటు వ్యక్తులు చేసే సర్వేకు పొంతన కుదరకపోతే ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకునే ప్రమాదం ఉంది. ఇలాంటి ఘటనలు రాజంపేటతో పాటు జిల్లాలో పలుమార్లు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం సర్వేయర్ల కొరత తీర్చి సమస్యలకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

శాశ్వత సర్వేయర్లను నియమించాలి



రాజంపేట గ్రామాన్ని ఆనుకొని నాకు కొంత వ్యవసాయం భూమి ఉంది. 2019లో నూతన పాస్ బుక్కులు మంజూరు చేసినపుడు 5 గుంటల భూమిని అబాది కింద చూపుతూ పాస్ బుక్ జారీ చేశారు. రెవెన్యూ అధికారుల తప్పిదంతో యాజమాన్య హక్కు విషయంలో సమస్య ఏర్పడింది. దీని కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాను. సర్వేయర్లను నియమిస్తే ఇలాంటి సమస్యలకు పరిష్కారం దొరకుతుంది.

– పొశం సిద్ధరాములు, రైతు, రాజంపేట

క్లుప్తంగా

'విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరిస్తాం'

బిచ్కుంద(జుక్కల్): పంట క్షేత్రాలకు వెళ్లి బోరు మోటారు, ట్రాన్స్‌ఫార్మర్, లో వోల్టేజీ, వంగిన, విరిగిన స్తంభాలు, తీగలు, ఇతర విద్యుత్ సంబంధిత సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని బిచ్కుంద ఏఈ ప్రవీణ్ కుమార్ అన్నారు. సమస్యలు తెలుసుకొని పరిష్కారం కోసం అధికారులు శుక్రవారం బిచ్కుందలో పొలంబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. రైతులు స్తంభాలకు సంబంధించిన పరికరాలు, తీగలు, ఇతర వస్తువులు కొనుక్కొని తీసుకురావాల్సిన అవసరం లేదన్నారు. ఎన్పీడీసీఎల్ సంస్థ అన్ని పరికరాలు ఉచితంగా అధికారులకు ఇస్తుందని తెలిపారు. అలాగే కొత్త స్తంభాలు, కొత్త మోటరు విద్యుత్ కనెక్షన్, ఇతర ఎస్టిమేషన్ ఇంగ్లీష్‌లో నివేదిక తయారు చేయవద్దని, రైతులకు అర్థమయ్యే విధంగా తెలుగులో ఉంటాయన్నారు. విద్యుత్ షాక్ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇతర సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేయాలని కోరారు.

మహాదేవుడిగుట్ట రోడ్డుకు మరమ్మతులు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుడిమెట్ గుట్టపై ఉన్న మహాదేవుడి ఆలయ రోడ్డుకు గాంధారి మాజీ సర్పంచ్ పెద్దబూరి సత్యం శుక్రవారం తన జేసీబీతో ఉచితంగా మరమ్మతులు చేసినట్లు తెలిపారు. గుట్టపైకి భక్తులు వెళ్లడానికి సీసీ రోడ్డు ఉంది కాని వర్షాలకు రోడ్డు పక్కన ఉన్న మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో భక్తులకు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ఆలయ పీఠాధిపతి ఈ విషయం సత్యంకు తెలియజేయడంతో ఆయన మరమ్మతులు చేయించారు.

బోరు ప్రారంభం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మర్కల్ గ్రామంలో ముదిరాజ్ సంఘ భవనం వద్ద ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నిధులతో వేసిన బోరును శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. తాగునీటి సమస్యను తీర్చినందుకు సంఘ సభ్యులతో పాటు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ జూకంటి సంగారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, మాజీ ఉప సర్పంచ్ రాజిరెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి, గంగారెడ్డి, రాజిరెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

12వసారి రక్తదానం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జంగం శ్రీశైలం 12వసారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తలసేమియా బాధితుల చిన్నారుల కోసం రక్తదానం చేయడం ఆత్మసంతృప్తి నిచ్చిందన్నారు. పలువురు ప్రతినిధులు శ్రీశైలంను అభినందించారు.

గోకుల్ సేన ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం



కామారెడ్డి టౌన్: గోకుల్ సేన ఆధ్వర్యంలో ఈనెల 10న జిల్లా కేంద్రంలో ఘనంగా సదర్ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం జిల్లా నాయకుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. పురాతనమైన ఈ సదర్ పండుగను మొట్టమొదటి సారిగా జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లో సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాదవులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రతినిధులు వెంకటి, రాజు, కిరణ్, మురళి, నరేందర్ తదితరులున్నారు.

విద్యుత్ సమస్యలు మా దృష్టికి తీసుకురండి


హాజరైన సీజీఆర్ఎఫ్ అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): వినియోగదారులు, రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో సభలు నిర్వహిస్తున్నామని చైర్‌పర్సన్ నారాయణ అన్నారు. శుక్రవారం పిట్లం సబ్ డివిజన్ పరిధిలోని నిజాంసాగర్ ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్ల అనుమతుల విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కరెంట్ సరఫరాలో అంతరాయం, లోవోల్టేజీ సమస్య, ట్రాన్స్‌కో అధికారుల నుంచి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సీజీఆర్ఎఫ్ అధికారులు రామకృష్ణ, కిషన్, రాజాగౌడ్, ఏడీ అరవింద్, ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ బాలాజీ, ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మాచారెడ్డి: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మాచారెడ్డి ఎస్సై అనిల్ సూచించారు. శుక్రవారం ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, షీటీములపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 8712686094 కు కాల్ చేయాలన్నారు. అలాగే సైబర్ నేరాల కట్టడికి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. అలాగే ప్రతి మహిళ సెల్‌ఫోన్‌లో టీసేఫ్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. కళాబృందం సభ్యులు ఆలపించిన పాటలు అలరించాయి. కళా బృందం సభ్యులు ప్రభాకర్, శేషారావు, సాయిలు, హెచ్ఎం శారద, తదితరులున్నారు.

క్రమశిక్షణతో చదవాలి



తాడ్వాయి(తాడ్వాయి): విద్యార్థులు ప్రణాళిక ప్రకారం క్రమశిక్షణతో చదవాలని ప్రొఫెసర్ శివకుమార్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం మోటివేషన్ క్లాసులను బోధించారు. ప్రతి ఒక్క విద్యార్థి స్నేహితులు, బంధువులని కాలయాపన చేయకుండా చదువుపై ధ్యాస పెట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని, క్రమశిక్షణతో చదివి రాబోయే వార్షిక పరీక్షలు బాగా రాసి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఉన్నతస్థాయిలో ఎదిగి పాఠశాల, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు. ప్రిన్సిపాల్ రాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు


బాన్సువాడలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి


కామారెడ్డి మున్సిపల్‌లో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ, నేతలు

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నేతలు కేకులు కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులకు పండ్లు, పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆవరణలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మెగా రక్తదాన, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


పండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి


నిజాంసాగర్‌లో ..


ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో..

ఉసిరి కాయల దీపోత్సవం



మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కార్తీక మాసం శుక్రవారం సందర్భంగా కామారెడ్డి సరస్వతీ శిశు మందిర్ సిబ్బంది ఉసిరికాయలతో దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీధర్ రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి గ్రామ బీఆర్ఎస్ కార్యకర్త వడ్ల రమేష్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా ఆయన గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కమ్మరి లక్ష్మీనారాయణ, హనుమంతుగారి గంగాధర్ రావు, కమ్మరి శ్రీనివాస్, తానోబా ఆనంద్ రావు, తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించండి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూర్ శివారులోని త్రిలింగేశ్వరాలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు శుక్రవారం లింగంపల్లికలాన్ గ్రామ ఆలయ కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి కోసం మంచి ట్యాంకు నిర్మాణం, ఆలయాన్ని కెమికల్ వాష్ చేయించేందుకు నిధులను కేటాయించాలని వారు కోరారు. ఆలయకమిటీ చైర్మన్ దత్తు, కమిటీ సభ్యులు వెంకన్న, రాజశేఖర్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు రాంచందర్‌రెడ్డి, వాసురెడ్డి, లక్ష్మణ్, మురళీగౌడ్, మహేష్‌రెడ్డి, నారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ పంటల సాగుపై దృష్టి సారించాలి


రైతు నగర్‌లో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం, పక్కన కాసుల బాల్‌రాజ్


హాజరైన రైతులు

బాన్సువాడ: రైతులు ఆయిల్‌పామ్ పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండలం రైతు నగర్ రైతు వేదికలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంటల విస్తరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. అయిల్‌పామ్ పంట దీర్ఘకాలిక పంట అని, పంటకు దోమల బెడద, కోతుల బెడద లేకుండా ఒకసారి నాటుకుంటే 30 ఏళ్ల వరకు పంట కోతకు వస్తూనే ఉంటుందన్నారు. ఆయిల్ పామ్ కంపెనీ వాళ్లే వచ్చి పంటను తీసుకుంటారని అన్నారు. పంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే ఆయిల్‌పామ్ సాగు ఒక్కటే పరిష్కారమన్నారు. పంట సాగుకు ప్రభుత్వం 80 నుంచి 90 శాతం సబ్సిడీ ఇస్తుందని అన్నారు. సదస్సులో జిల్లా ఉద్యానవన అధికారి జ్యోతి, బాన్సువాడ డివిజన్ అధికారి సంతోషిరాణి, బాన్సువాడ వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న, ఆయిల్‌పామ్ జనరల్ మేనేజర్ అశోక్, జుక్కల్ మాజీ ఎంపీపీ రఘు, తహసీల్దార్ శ్రీలత తదితరులున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనలో పోచారం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం నిర్వహించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజ్‌లు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు వారిని పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణ ప్రహరీని ప్రారంభించారు. మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, నాయకులు పెర్క శ్రీనివాస్, ఓంట్ల మహేందర్, సాయిరాం యాదవ్, ప్రతాప్, భాస్కరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మిర్జాపూర్‌లో గౌస్ చెరువు, మల్లెకుంట చెరువులలో లక్షా 52 వేల 115 చేప పిల్లలను జిల్లా మత్స్య శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, చైర్మన్ దొబ్బల గంగాధర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాతూ.. ప్రతి చేప పిల్ల 80–100 ఎంఎం ఉందన్నారు. ఈ చేప పిల్లలను తూకం, నాణ్యత చూసి చెరువులో వదిలామన్నారు. మండల మత్స్య సంఘం సభ్యులు ఉషికేలా హన్మండ్లు, గంగాధర్, శ్రీనివాస్, పోశెట్టి తదితరులున్నారు.

విద్యార్థులకు సక్రమంగా బోధించాలి



ఎల్లారెడ్డిరూరల్: విద్యార్థులకు సక్రమంగా బోధన చేయాలని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని గూడెంకాలనీలో గల ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కౌన్సిలర్ నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరీష్ తదితరులున్నారు.

ఘనంగా బారడి పోచమ్మ పండుగ

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో శుక్రవారం బారడి పోచమ్మ పండగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు తీసుకొచ్చి పోచమ్మ దేవతకు సమర్పించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. బంధు మిత్రులతో కలిసి వనభోజనాలు చేశారు.


బోనాలు తీసుకొచ్చిన భక్తులు

ధాన్యం కొనుగోళ్లు పునఃప్రారంభం


మరమ్మతులు చేపట్టిన లింగంపల్లికలాన్ రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్


ధాన్యం తూకం చేయిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

- రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు
- కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రోడ్డు బాగాలేక లారీలు రాకపోవడంతో లింగంపల్లికలాన్‌లో నిలిచిన ధాన్యం కొనుగోళ్ల శుక్రవారం పునఃప్రారంభమయ్యాయి. మాల్తుమ్మెద సొసైటీ ద్వారా రూ.10వేలు వెచ్చించి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టడంతో గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం పనులు పునఃప్రారంభమయ్యాయి. గ్రామంలో ధాన్యం తూకం పనులు నిలిచిపోయిన విషయమై శుక్రవారం పలు దినపత్రికలలో కథనాలు రావడంతో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రంలోని సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. లారీలు రావడంలేదని రైతులు ఆర్డీవోతో చెప్పడంతో సంబంధిత కాంట్రాక్టర్‌తో ఆయన ఫోన్లో మాట్లాడారు. అంతకుముందు తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన రోడ్డును ఆర్డీవో పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ మహ్మద్, సొసైటీ మాజీ చైర్మన్ రాంచందర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, గణేష్ తదితరులున్నారు.

సంక్షిప్తం

టీపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ అనిల్ కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. నేడు(శనివారం) జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి హాజరువుతున్నారన్నారు.

నూతన ఓటరు నమోదు, సవరణల కోసం ప్రత్యేక శిబిరం

రాజంపేట: ఓటు నమోదు, సవరణల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనిల్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు, రేపు(ఆదివారం) రెండు రోజులు నూతన ఓటర్ల నమోదు, తొలగింపు సవరణల కోసం సంబంధిత బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఫారం–6,7,8ల ద్వారా తమ ఓటు నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినిగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పారిశుధ్య పనులు పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): మెంగారం, బాయంపల్లి, బాణాపూర్‌తండా, బాణాపూర్, బోనాల్ గ్రామాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం ఎంపీవో మలహరి పరిశీలించారు. మురికి కాల్వల పూడికతీత, చుట్టు ప్రక్కల పిచ్చిమొక్కలను తొలగించినట్లు తెలిపారు. రోడ్లపై చెత్తా చెదారం వేయకుండా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. అనంతరం జీపీ రికార్డులను పరిశీలించారు.

16న విద్యలో విలువలపై చర్చా కార్యక్రమం

కామారెడ్డి అర్బన్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హైదరాబాద్ గచ్చిబౌలిలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో విద్యావంతుల చర్చ(ఎడ్యుకేటర్స్ సింపోజియం) నిర్వహిస్తున్నట్లు నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి జయదీదీ తెలిపారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజం కోసం విద్యలో విలువలు– ఆధ్యాత్మికత అంశంపై మేధావుల చర్చ ఉంటుందని ఆసక్తిగల వారు ముందుగా సంప్రదించి తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు బీకే సంతోషిణి 99129 16539 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

11 నుంచి ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం

కామారెడ్డి అర్బన్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్థానిక సిరిసిల్ల రోడ్డులోని మార్వాడీ ధర్మశాలలో ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం ఏర్పాటు చేసినట్లు బ్రహ్మకుమారీస్ నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి జయదీదీ తెలిపారు.